# పాడిందే పాట

మనిషి తానుగా ఏదీ నిర్ణయించుకొందుకు సమర్థుడుకాడు. అతనికా అవకాశం లేదు. మనిషి స్వతంత్రుడు కాడు. అతని జీవితం సంపూర్ణం కాదు, అతని ఆలోచనలు, అతని నిర్ణయాలు అతనివి కావు. తానుగా ఏదీ నిర్ణయించుకుందుకు అవకాశం యివ్వకుండా తాము చెప్పినట్లు సామాన్యుడ్ని లొంగదీసుకొనటం కోసం పబ్లిసిటీ బాగా వుపయోగపడుతుంది. ఈ పబ్లిసిటీని నమ్ముకుని చెత్త సినిమాలు చూడటం, చెత్త పుస్తకాలు చదవటం, పనికిరాని వస్తువుల్ని కొనటం, పోరంబోకు సంస్థల్ని మనుషుల్ని నమ్మటం లాటిది సామాన్యుడు చేస్తున్నాడు. ఒక విషయాన్ని పదే పదే చెప్పటంవలన నిజం కామోసు అనే భ్రాంతి కలుగుతుంది. నిజం అయినా కాకపోయినా పాడిందే పాటగా పాడుతుంటే జనం నమ్మేస్తారు, జనాన్ని మోసం చేయాలంటే ముందు వారిని నమ్మించాలి. నమ్మని వారిని మోసగించటం సులభంకాదు. భారీఎత్తున పబ్లిసిటీ జరిగే ప్రతి విషయంలో భారీఎత్తున మోసం జరిగే అవకాశం వున్నట్లే లెక్క. రాజకీయాలలో దగాకోరుతనం వుంది. వాణిజ్యంలో సరేసరి. అది ఎప్పుడూ వుండనే వుంటుంది తోడుపెళ్ళికూతుర్లా. జీవితంలో కూడా వుంది. కళల్లోకి ఎప్పుడో ప్రాకింది. ప్రచారం వలన జరిగే మోసం, అన్యాయం చట్టబద్ధమైనవని వప్పుకుని తీరాలి. వీటిని ఎదుర్కొనడానికి సామాన్యుడు అసమర్థుడు.

ఇది కుటుంబాల్లో కూడా వుంది. ఎదుటివారి గురించి చెడుప్రచారం చేయకుండా తమ గురించి మంచిని ఎక్కువగా చెప్పుకోవటం సెల్ఫ్ పబ్లిసిటీ క్రిందే లెక్క.

ఒక తల్లి "మా వాళ్ళందరికీ ఫస్టుమార్కులు. క్లాసులోనూ పిల్లలంతా తెలివైనవాళ్ళు, బుద్ధిమంతులు" అని తన బిడ్డల్ని వాళ్ళ ఎదురుగానే తెగ మెచ్చుకొంటుంది. వాళ్ళు కూడా మా అమ్మ దేవత చాలా మంచిది అంటారు. నిజానికీ వాళ్ళంతా సమానమైన తెలివి కలవారు కారు ఏదో మామూలుగా చదువుకొంటారు. ఆవిడ కూడా ఆదర్శమాత ఏమీ కాదు. సినిమాలకు, కాఫీలకు డబ్బులివ్వాలిసొస్తుందని మా పిల్లల కేమీ చెడు అలవాట్లు లేవు. డబ్బులిమ్మని అడగరు యిస్తే పుచ్చుకోరు అనే



ప్రచారం చేస్తుంది. ఆ కుటుంబంలోని వారంతా కొన్ని గళ్ళు గీసుకుని ఆ గళ్ళమధ్య జాగ్రత్తగా వుంటారు. బెంచీ టిక్కెట్టుకే వెళ్ళాలి సినిమాకు. రేడియో వినాలంటే పార్కుకో, ఎదురింటికో వెళ్ళాలి కాని కొనమని అడగకూడదు (రేడియో వుంటే పిల్లల చదువులు చెడిపోతాయి). ఇంట్లో విస్త్రీ బట్టలు కట్టుకుని తిరగకూడదు. ఒక పండగకి కొన్న కొత్త బట్టల్ని కనీసం తడపకుండా రెండు పండగలకి కట్టుకోవాలి. ఎవరైనా చుట్టా

లొచ్చినపుడు డబ్బులిస్తే అవి వాళ్ళు వెళ్ళాక మర్యాదగా పట్టుకొచ్చి అమ్మ కిచ్చెయ్యాలి. అమ్మ అవన్నీ కిడ్డీబ్యాంకులో దాచిపెడ్తుంది. మనం టిఫిన్లూ కాఫీలుచేసే వేళ ఫ్రండ్స్‌ని ఇంటికి తీసుకురాకూడదు. వాళ్ళని అరుగుమీద నుంచోమని కావలిస్తే మంచినీళ్ళివ్వాలి. ఇంట్లోకి తీసుకొచ్చి నెత్తిమీ ఎక్కించుకోకూడదు. పత్రికలు, పుస్తకాలు కొని చదవకూడదు. ఊరికేద తెచ్చి చదవాలి, చందాలవాళ్ళని ఇంటికి రానివ్వకూడదు. అమ్మా నాన్న లేరని చెప్పి పంపించాలి. హరికథలకీ పురాణాలు వింటానికి గుళ్ళోకెళ్ళినా హారతిపళ్ళెం రాకుండా వచ్చేసెయ్యాలి. మనింట్లో రెండు మూడు రోజులు వుండి భోంచేసిన బంధువులచేత చెప్పులు, పెన్నూ, రిబ్బన్లు, రుమాళ్ళ అడిగి కొనిపించుకున్నా తప్పులేదు. ఇవన్నీ జీవితపు రూల్సు.

మావారి కజి నొకావిడుంది. ఆవిడ తలనొప్పి సుందరి. ఇంకే రోగం లేకపోతే ఆవాళ తలనొప్పయినా వుండి తీరాల్సిందే. ఆవిడ ఆటో బయాగ్రఫీ చెబుతుంది. అంతా తనకు వచ్చిన రోగాల గురించి, తను పడ్డ అవస్థల గురించే తనకు జరిగిన ఆపరేషన్లూ, యిచ్చిన ఇంజక్షన్లూ, చెల్లించిన బిల్లులూ, ఆసుపత్రిలో ఆవిడ గడిపిన రోజులూ అన్నీ వర్ణించి మీకు ఏ రోగమూ లేక శుభ్రంగా ఆరోగ్యంగా వుండటం ఒక దురదృష్టమేవో నని మీకు అనుమానం కలిగేలా చేస్తుంది. ఒక ఆపరేషన్‌గాని, ఒక మారైనా సెలైన్ యివ్వటం కాని, ఒక యాభై ఇంజెక్షన్లుగాని పుచ్చుకో లేదంటే మీరు చాలా అనాగరికుల క్రిందే లెక్క. ఏదో ఒక రోగంతో తీసుకుంటూన్నట్లు చెబుతూ ఆవిడ కూర్చున్నచోటనుంచి లేవదు. ఇక్కడ పుల్ల అక్కడ పెట్టదు. ఆవిడ ఒకవేళ లేచినా మీరే అనేస్తారు ఏం లేస్తావులే నుళ్ళీ పడిపోతే అప్రతిష్ఠ అని.

మరొక రకం మనుషులున్నారు. వాళ్ళు మా ఆవిడ అనకుండా మాట ఎత్తలేరు. వాళ్ళావిడ అప్పుడెటువంటి స్థితిలోవున్నా ఆవిడ్ని రెక్క పుచ్చుకు మాటల మధ్యలోకి యీడ్చుకురావలసిందే. వాళ్ళు తాము చెప్పే దానికి వత్తాసుకోసం ఆవిడ్ని కూడా యీడ్చుకొచ్చి మన్ని మధ్యపెడతారు. మనం ఎప్పుడైనా ఆవిడ్ని చూడటం పడితే ఈ మాటల సుందరి మాయ

మైపోయి మనకు ఉపన్యాసకు డిచ్చిన పిక్చర్‌కి పూర్తిగా భిన్నమైన శాస్త్రీ కనపడుతుంది.

దుష్ప్రచారం అని ఏదైతే వుందో దాన్ని ఎదుర్కొనటం సుళువు. కాని స్వయంప్రచారం చేసుకునేవారు వదిలే అజాగ్రత్త బాణాలే సూటిగా గుచ్చుకొని మన్ని గిలగిల్లాడించేస్తాయి.

ఏ సబ్బువాడాలో సబ్బుల కంపెనీల ప్రకటనలు నిర్ణయించినట్లు, వాడవలసిన దుస్తులు, చదవవలసిన పుస్తకాలు, చేయవలసిన స్నేహాలు, చూడవలసిన సినిమాలు, తినవలసిన వస్తువులూ అన్నీ మనకోసం ఎవరో ముందే నిర్ణయించేసి ఉంచినట్లు కనపడుతుంది. ప్రీ పబ్లిసిటీవల్ల కుటుంబ జీవితమే గాకుండా వ్యక్తి జీవితాలూ ఎవరో నిర్దేశించినట్టు నడవ్వలసి వస్తోంది. ఇది ఆలోచించినకొద్దీ మరీ దారుణమైన విషయం అని తోస్తుంది.